

అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మద్దతు ప్రకటిస్తున్న డాలస్ రాయలసీమ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

## డాలస్ సభకు సీమ ఎన్నారైల మద్దతు

- రజతోత్సవానికి పలువురు ప్రముఖుల సంఘీభావం
- కృతజ్ఞతలు తెలియజేసిన బీఆర్ఎస్ ఎన్నారై సెల్
- జోరుగా కొనసాగుతున్న సన్నాహక సమావేశాలు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): 'ప్రాంతాలుగా విడిపోదాం. అన్నదమ్ములుగా కలిసి ఉందాం' అని ఉద్యమకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ఉద్బోధ ఇప్పటికీ ఎందరికో స్ఫూర్తినిస్తున్నది. జూన్ 1న అమెరికాలోని డాలస్‌లో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ నిర్వహించనున్న సభకు రాయలసీమ ఎన్నారైలు మద్దతు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా డాక్టర్ పెప్పర్ ఎరినాలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం అయ్యేందుకు సాటి తెలుగువారిగా తాము కూడా తోడ్పాటునందిస్తామని రాయలసీమ ఎన్నారై విభాగం ప్రకటించింది. ఈ మేరకు రాయలసీమ ఎన్నారై సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డాక్టర్ దర్గా నాగిరెడ్డి, చందు చింతల, కృష్ణారెడ్డి కొడూరు, శివ అన్నపురెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధులు సోమవారం సంఘీభావం ప్రకటించారు. తమకు సంఘీభావం ప్రకటించిన రాయలసీమ ఎన్నారై ప్రతినిధులకు బీఆర్ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికాలో మొదటిసారిగా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సభపై అమెరికా వ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని మహేశ్ తన్నీరు చెప్పారు.

### కొనసాగుతున్న సన్నాహక సమావేశాలు

డాలస్ సభ నేపథ్యంలో అమెరికాలోని పలు ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు జోరుగా సాగుతున్నాయి. సభ సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ ఎన్నారై విభాగం వేగం పెంచింది. సోమవారం కూడా సన్నాహక సమావేశాలు జరిగాయి. న్యూజెర్సీలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతికిరణ్ చంటి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, కొణతం దిలీప్ తదితరులు పాల్గొన్నారు. బే, హ్యూస్టన్ ఏరియాలో వీరితో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్దిరెడ్డి, నోముల భగత్ హాజరవుతారని మహేశ్ బిగాల, మహేశ్ తన్నీరు తెలిపారు. డాలస్ సభను విజయవంతం చేయడం తెలంగాణ బిడ్డలుగా తమ విద్యుక్త ధర్మమని పేర్కొంటూ పలువురు ఎన్నారైలు మద్దతు ప్రకటించారు. వారిలో రావు కాల్వల, సురభి శ్రీనివాస్, అభిలాశ్ రంగినేని, అన్వేశ్‌రెడ్డి, కిరణ్ మిర్యాల, శ్యామ్, హృషీకేశ్‌రెడ్డి, మనోజ్ ఏనుగంటి, సత్యం, యాదగిరి ఉన్నారు.


## కృష్ణా మిగులు జలాలను పాలమూరుకే కేటాయించాలి

- సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): గోదావరి-బనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్టు వల్ల కృష్ణా నదిలో ఏర్పడే మిగులు జలాలను ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నెట్టెంపాడు, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులకు కేటాయించాలని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ దిశగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని, ట్రిబ్యునల్‌లో గట్టిగా వాదనలు వినిపించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పోలవరం డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిందని గుర్తుచేస్తూ.. ఆ జలాల వినియోగానికి సైతం ఏపీ అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, హంద్రినీవా, గాలేరు నగరి సుజల స్రవంతి, ముచ్చుమర్రి, మల్యాల తదితర లిఫ్టులను ఏపీ అక్రమంగా నిర్మించడంతో పాటు అంతకంతకూ విస్తరిస్తూ ఏటా కృష్ణా జలాలను పెన్నా బేసిన్‌కు మళ్లిస్తున్నదని పేర్కొన్నారు. దీంతో కృష్ణానది పక్కనే ఉన్న మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు నదీ జలాలు దక్కడం లేదని తెలిపారు.

# రెండు కండ్ల బాబుకు రెండు నాల్కలు!

**సముద్రంలో కలిసే జలాలనే వాడుకుంటామన్న ఏపీ సీఎం.. 2వేల టీఎంసీల వృథాలో 200 టీఎంసీలు మళ్లిస్తే తప్పేంటని వ్యాఖ్య**



- అసలు ఈ ప్రాజెక్టుపై ఎవరికీ అభ్యంతరాలు ఉండొద్దంటూ సుద్దులు
- కాళేశ్వరంపై కొర్రీలు పెట్టి ఫిర్యాదులు చేసినప్పుడు ఈ నీతులేమైనయి?
- తెలంగాణ ప్రాజెక్టులపై కేంద్రానికి బోర్డులకెందుకు ఫిర్యాదు చేసినట్టు?
- నాడు అక్రమ ప్రాజెక్టులు అంటూ కేసులు వేసేందుకూ వెనుకాడని బాబు

హైదరాబాద్/సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ... ఆంధ్రప్రదేశ్.. తనకు రెండు కండ్లలాంటివి అన్న చంద్రబాబుకు రెండు నాల్కలు ఉన్నట్టుంది! అందుకే గోదావరి జలాల వాడకంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. నిన్నటిదాకా గోదావరిపై తెలంగాణ నిర్మించిన ప్రాజెక్టులపై పడి ఏడ్చిన చంద్రబాబు ఇప్పుడు తాను చేపట్టే బనకచర్లపై ఎవరికీ అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదని చెప్పుకొస్తున్నారు. ఏటా సముద్రంలో రెండు వేల టీఎంసీల వరకు వృథాగా కలుస్తున్న గోదావరి జలాలను వాడుకుంటే తప్పేమిటని బుకాయిస్తున్నారు. కానీ, ఇదే చంద్రబాబు తెలంగాణ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి చిన్న లిఫ్టు స్కీం అయిన భక్తరామదాసు వరకు తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఎడాపెడా ఫిర్యాదులు చేశారు. గోదావరి బోర్డు నుంచి కేంద్రం వరకు కొర్రీలు పెట్టి మరీ ప్రాజెక్టులను నిలిపివేయాలంటూ ప్రతి గడప ఎక్కారు. అనేక వేదికలపై అభ్యంతరాలు వ్యక్తం చేసి కేసులు కూడా వేయించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం తనకు హక్కుభక్తుంగా ఉన్న నీటి కేటాయింపుల్లో నుంచే గోదావరిపై ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. వీటిపైనే అభ్యంతరాలు వ్యక్తంచేసిన చంద్రబాబు... ఇప్పటికే కేటాయింపులకు మించి గోదావరిపై ప్రాజెక్టులు నిర్మించడమే కాకుండా, అదనంగా బనకచర్లపై నీతి సూత్రాలు వల్లిస్తుండటంపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది.

### అడుగడుగునా మోకాలడ్డిన చంద్రబాబు

తెలంగాణ ఏర్పాటు తరువాత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టింది. ప్రాజెక్టు ముందుకు కొనసాగకూడదనే దూరాలోచనతో నీటి లభ్యత లేనిచోట, అభయారణ్యం, అంతర్రాష్ట్ర సమస్యలు తలెత్తుతాయని తెలిసినా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ఉమ్మడి పాలకులు ప్రతిపాదనలు చేయడం, ఆ సమస్యలన్నింటికీ పరిష్కారంగా కేసీఆర్ ఆ ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా రీ డిజైన్ చేయడం తెలిసిందే. గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయని చెప్తున్న సీఎం చంద్రబాబు నాడు కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వకూడదంటూ కేంద్ర జల్‌శక్తి శాఖకు, కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) లేఖలు రాశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి కృష్ణా, గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులను చేపట్టాలంటే ముందస్తు అనుమతి, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఉటంకిస్తూ అప్పటికే ఉమ్మడి రాష్ట్రంలోనే చేపట్టిన ప్రాజెక్టు అయినప్పటికీ కాళేశ్వరంపై గగ్గోలు పెడుతూ ఫిర్యాదులు చేశారు. ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులోనూ ప్రాజెక్టుపై కొర్రీలు పెడుతూ వచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అన్ని అనుమతులు మంజూరు చేయగా, టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) తుది అనుమతులు జారీ చేసే తరుణంలోనూ 2018లో లేఖ రాశారు. ప్రాజెక్టుపై ప్రతి దశలోనూ మోకాలడ్డుతూ వచ్చారు.

### 'పాలమూరు'పై ముప్పేట దాడి

టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ఎన్టీఆర్ తరహాలోనే దత్తత తీసుకున్నారు. తీరా జిల్లాకు చేసిందేమైనా ఉన్నదా అంటే శూన్యం. పాలమూరు కరువు, వలసల పేరు చెప్పుకుని ప్రపంచబ్యాంకు రుణాలను పొందారు తప్ప అందులో ఒక్క పైసా కూడా అక్కడి ప్రాజెక్టులకు ఖర్చుచేయలేదు. కానీ, అంతకు మించి విద్రోహాన్ని తలపెట్టారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరమూ అదే వివక్షను కొనసాగించారు. అంతేకాదు, కేసీఆర్ సర్కారు శ్రీశైలం జలాశయం నుంచి 60 రోజుల్లో 90 టీఎంసీల వరద జలాలను ఎత్తిపోసి ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో కలిపి మొత్తంగా 12,30,000 ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సాగునీటి పథకానికి (పీఆర్ఎల్ఐఎస్) శ్రీకారం చుడితే ఓర్వలేకపోయారు. ఇది కూడా గతంలో ఉమ్మడి పాలకులు అనుమతులు మంజూరు చేసిన ప్రాజెక్టే! అయినప్పటికీ, దానిని ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు చంద్రబాబు చేయని ప్రయత్నాలు లేవు. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వకూడదంటూ 2015 జూన్‌లో కేంద్ర జల్‌శక్తి శాఖకు ఏపీ సర్కారుతో లేఖ రాయించారు. సీడబ్ల్యూసీకి స్వయంగా ఫిర్యాదు చేశారు. అంతేకాదు, నాటి కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి ఉమాభారతికి 2016లో ప్రత్యేకంగా లేఖ రాశారు. పాలమూరు ప్రాజెక్టుపై ఫిర్యాదు చేయించారు. అటు తరువాత స్థానిక రైతులను, అనుయాయులను ప్రోత్సహించి ఎన్జీటీలో కేసులు వేయించి ప్రాజెక్టును అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. ప్రాజెక్టు పనుల్లో తెలంగాణ పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదంటూ ఎన్జీటీలో ఏపీకి చెందిన రైతులు పిటిషన్ దాఖలు చేయగా, అందులో పనిగట్టుకుని చంద్రబాబు సర్కారు ఇంప్లీడ్ అయ్యింది. సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశాల్లోనూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై ఏపీ ఎక్కడాలేని అభ్యంతరాలను లేవనెత్తింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని లేఖలో ఫిర్యాదు చేసింది. అంతేకాదు, సుప్రీం కోర్టును సైతం ఆశ్రయించింది.

### ఇప్పుడేమో అభ్యంతరాలు వద్దంటూ సుద్దులు

గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును రూ.80వేల కోట్లతో ఏపీ చేపట్టిన విషయం తెలిసిందే. నీటి లభ్యత లేదని చెప్తూనే 200 టీఎంసీలను గోదావరి నుంచి పెన్నాబేసిన్‌కు మళ్లించేందుకు సిద్ధమయ్యారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని, బచావత్ ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి మరీ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు దూకుడుగా ఏపీ సీఎం చంద్రబాబు ముందుకుసాగుతున్నారు. నిధుల సమీకరణకు అమరావతి కార్పొరేషన్‌ను ఏర్పాటుచేశారు. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. అయినప్పటికీ, ఈ జీబీ లింక్ ప్రాజెక్టుపై ఎవరూ అభ్యంతరం తెలపాల్సిన అవసరం లేదంటూ బాబు నేడు చిలుక పలుకులు పలకడమే విడ్డూరం. జీబీ లింక్ ఇంట్రా రివర్ లింక్ ప్రాజెక్టని, వందేండ్ల సగటును తీసుకున్నా రెండువేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, అలా పోయే 200 టీఎంసీల మిగులు జలాలను కరువు ప్రాంతాలకు తరలిస్తున్నామని, దీనిపై అభ్యంతరం చెప్పాల్సిన అవసరం ఏ రాష్ట్రానికీ లేదని, అందరితో మాట్లాడుతామని చెప్పుకొస్తున్నారు. ఇది చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి అద్దంపడుతున్నది.

### ● ప్రతీ ప్రాజెక్టుపై.. ప్రతీ వేదికపై ఫిర్యాదు

**కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి** ప్రాజెక్టులనే కాదు తెలంగాణ ప్రాజెక్టులన్నింటిపైనా చంద్రబాబు అడుగడుగునా ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ప్రతీ ప్రాజెక్టుపై, ప్రతీ వేదికపై తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరుచేసి అటకెక్కించిన ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించినా కూడా కొత్త ప్రాజెక్టులంటూ గగ్గోలు పెట్టారు. నల్లగొండ జిల్లాకు సంబంధించిన దిండి (నక్కలగండి) ప్రాజెక్టు, ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందించేందుకు చేపట్టిన తుమ్మిళ్ల లిఫ్ట్, ఖమ్మం జిల్లాలో చేపట్టిన భక్తరామదాసు లిఫ్ట్ స్కీమ్, సమీకృత సీతారామ సీతమ్మసాగర్, దేవాదుల ఆయకట్టుకు భరోసా కల్పించేందుకు చేపట్టిన సమ్మక్కసాగర్ ప్రాజెక్టులపై ఫిర్యాదులు చేశారు. నీటిలభ్యత లేదంటూ, ఏపీకి నీరే అందకుండా పోతుందని చెప్తూ, అనుమతులు ఇవ్వకూడదంటూ సీడబ్ల్యూసీకి లేఖలు రాశారు. రివర్ బోర్డులకు ఫిర్యాదులు చేశారు. ఆఖరికి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణ సర్కారు జలవిద్యుత్తు ఉత్పత్తిని కూడా చేపట్టకుండా చూడాలంటూ కేంద్రానికి అనేకమార్లు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతీ వేదికపైనా తెలంగాణ ప్రాజెక్టులపై వ్యతిరేకతను చాటుకున్న చరిత్ర చంద్రబాబుది.

### ● ఆదినుంచీ వంతపాడుతున్న కేంద్రం

ఏపీ సీఎం చంద్రబాబు చర్యలన్నింటికీ కేంద్రంలోని బీజేపీ సర్కారు వత్తాసు పలుకుతున్నది. తెలంగాణ హక్కులకు గండి కొడుతున్నది. తీరని విద్రోహాన్ని తలపెడుతున్నది. సెక్షన్-3 ప్రకారం ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసి, నదీ జలాల పునఃపంపిణీ చేపట్టాలని స్వరాష్ట్ర ఏర్పాటు నుంచీ తెలంగాణ సర్కారు, అప్పటి సీఎం కేసీఆర్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇప్పటికీ కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. మరోవైపు, నికర జలాలు ఉన్న ప్రాజెక్టులకే అనుమతులు ఇచ్చేలా కేంద్రం కొత్తగా సీడబ్ల్యూసీ మార్గదర్శకాలనూ రూపొందించింది. అక్కడితో ఆగకుండా రివర్ బోర్డుల గెజిట్‌ను విడుదల చేసి అందులో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును అనుమతులు లేని ప్రాజెక్టుల జాబితాలో చేర్చి మరో విద్రోహానికి పూనుకున్నది. అప్పటికీ బీజేపీ ఏమైనా ఊరుకున్నదా అంటే అదీ లేదు. ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ డీపీఆర్‌ను, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను సైతం పరిశీలన జాబితా నుంచి తొలగించింది. నిధుల విషయంలో చూపుతున్న వివక్షను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు.

## జనాభా లెక్కల షెడ్యూల్ విడుదల చేయాలి

- వినోద్‌కుమార్ డిమాండ్



హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం వెంటనే జనాభా లెక్కల షెడ్యూల్ విడుదల చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాద్‌లో ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఎన్డీయే కూటమి సమావేశంలో హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కులగణనకు మద్దతు ఇచ్చే తీర్మానాన్ని ప్రతిపాదించారని పేర్కొన్నారు. 2020-21లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ కారణంగా వాయిదా పడ్డాయని గుర్తు చేశారు. జనాభా లెక్కలను ఎప్పటివరకు పూర్తి చేస్తామనే విషయాన్ని కేంద్రం చెప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. జనాభా లెక్కలు ఎప్పుడు చేపడుతుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## ద్రోహులతోనే తెలంగాణ చీకట్లోకి

- రాష్ట్రాన్ని కాపాడేది బీఆర్ఎస్సే: ఆర్ఎస్పీ



కాగజ్‌నగర్, మే 26 : ద్రోహులతోనే తెలంగాణ రాష్ట్రం చీకట్లో నెట్టబడిందని, తెలంగాణను కాంగ్రెస్ దోపిడీ నుంచి విముక్తి చేసేది, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం తదితర ద్రోహులు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనప్పలాగే తిరిగి పార్టీలోకి వచ్చేందుకు తియ్యటి మాటలు మాట్లాడినా ఆశ్చర్యంలేదని చెప్పారు. కోనప్ప కాంగ్రెస్‌లో చేరే నాటికే తాను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో కేసీఆర్‌తో ఎన్నికలలో పొత్తుపై చర్చించినట్టు గుర్తుచేశారు. సిర్పూర్‌లో కోనేరు కోనప్ప కుటుంబం మాఫియా దౌర్జన్యాల నుంచి ప్రజలు విముక్తి కోరుకున్నందుకే తాను సిర్పూర్ నియోజవర్గానికి వచ్చానని తెలిపారు.

# కమీషన్లు కొట్టెయ్.. కప్పం కట్టెయ్

- రూ.లక్ష కోట్ల పనులకు టెండర్లు
- ఢిల్లీకి రేవంత్ డబ్బు పంపే ప్లాన్లు
- డబ్బు ఎక్కడినుంచి వస్తున్నది?
- రుణమాఫీ, రైతుబంధుకు లేని పైసలు అందాల పోటీలకెక్కడివి?
- సిద్దిపేట జిల్లా పాలమాకులలో కృష్ణస్వామి, సాయన్న విగ్రహాలను ఆవిష్కరించిన హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలో కొరవి కృష్ణస్వామి ముదిరాజ్, పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో బండ ప్రకాశ్‌ముదిరాజ్ తదితరులు

సిద్దిపేట, మే 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేవంత్‌రెడ్డి సర్కారు కమీషన్ల కోసం, జేబులు నింపుకోవడానికి, ఢిల్లీకి కప్పం కట్టడానికి రూ.లక్ష కోట్ల టెండర్లు పిలుస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రైతులకు పంట రుణమాఫీ చేయమంటే పైసలు లేవు, రైతుబంధు ఇవ్వమంటే పైసలు లేవు. వానకాలం రైతుబంధు ఇవ్వలేదు. యాసంగిలో సగం మందికి కూడా ఇవ్వలేదు. కానీ, హెచ్ఎండబ్ల్యూఎస్‌లో రూ.10 వేల కోట్లు, జీహెచ్ఎంసీలో రూ.7,000 కోట్లు, హెచ్ఎండీఏలో రూ.20 వేల కోట్లతో టెండర్లు పిలిచారు. ఫ్యూచర్‌సిటీలో రేవంత్‌రెడ్డి భూములు కొనుక్కున్నాడట. ఆరు లైన్ రోడ్డు వేసుకోవడానికి రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తున్నరు. వీటన్నిటికీ డబ్బులు ఎక్కడినుంచి వసున్నాయి' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మత్స్యకారులకు, కులవృత్తులకు ఉపాధి కల్పించమంటే డబ్బులు లేవంటున్నారని దుయ్యబట్టారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌తో కలిసి కొరవి కృష్ణస్వామి ముదిరాజ్, పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలు ఇవ్వడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. అందాల పోటీల నిర్వహణకు పైసలున్నాయి కానీ, విత్తనాలు, చేపపిల్లలు ఇవ్వడానికి పైసల్లేవా? అని నిలదీశారు. ఎవరి కడుపు నింపడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

### కృష్ణస్వామి, సాయన్న ఆదర్శనీయులు

విగ్రహాలను ఆవిష్కరించడం ఎంత ముఖ్యమో వారిని జీవితంలో ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లడం కూడా అంతే ముఖ్యమని హరీశ్‌రావు ఉద్బోధించారు. కృష్ణస్వామి ముదిరాజ్ హైదరాబాద్ తొలి మేయర్‌గా ముదిరాజ్ సమాజానికి చేసిన కృషి ఎంతో గొప్పదని వివరించారు. పండుగ సాయన్న పేదల కోసం పోరాడి చివరికి ప్రాణాలను వదిలడం ఎందరికో ఆదర్శమని చెప్పారు. కానిస్టేబుల్ కిష్టయ్య తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసి చరిత్రపుటల్లో నిలిచిపోయారని గుర్తుచేసుకున్నారు. కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహాలను అనేకచోట్ల ఏర్పాటుచేసుకున్నామని చెప్పారు. ఆయన కుటుంబాన్ని కేసీఆర్ ఆదుకున్నారని, వారి కూతుర్ని ఎంబీబీఎస్ చదివించారని, ఇప్పుడు పీజీ చదివిస్తున్నారని తెలిపారు.

### అన్ని చెరువుల్లో చేపపిల్లలను వదలాలి

ఈ ఏడాదైనా రాష్ట్రంలోని అన్ని చెరువులు, కుంటల్లో చేపపిల్లను వదలాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రూ.1,000 కోట్లు ఖర్చు చేసి ముదిరాజులకు బండ్లు, ఆటోలు, పడవలు, వలల కోసం ఆర్థిక సాయం అందించామని, ఏటా రూ.120 కోట్లు ఖర్చు చేసి ఉచితంగా చేపపిల్లలు, రొయ్యలను చెరువులు, ప్రాజెక్టుల్లో విడుదల చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సగం జిల్లాల చెరువుల్లో కూడా చేపపిల్లలను వదలలేదని విమర్శించారు. జూన్ వస్తున్నా ప్రభుత్వం చేపపిల్లల టెండర్లు పిలవలేదని, దీంతో ముదిరాజుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నదో స్పష్టమవుతున్నదని దుయ్యబట్టారు. చేపపిల్లలను చెరువుల్లో వదలకపోతే ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి ఈడీ చార్జిషీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు చేర్చినందున వెంటనే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాజకీయ పదవుల కోసం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియన్ సంస్థ కోసం కోట్ల రూపాయలను విరాళంగా సేకరించారని ఆరోపించారు. ఈ చర్యలు చట్టపరమైన నిబంధనలతోపాటు రాజ్యాంగ నైతికతను ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సీఎం పదవిలో రేవంత్‌రెడ్డి కొనసాగడం అంటే ప్రజాసేవ ఆత్మను కించపర్చడమే అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తులు అత్యుత్తమ ప్రమాణాలు కలిగి ఉండాలని సూచించారు. ఈడీ కేసు దర్యాప్తులో ఉండగా సీఎం పదవిలో రేవంత్‌రెడ్డి కొనసాగడం అంటే అది కుర్చీ గౌరవాన్ని కించపర్చడమేనని అభిప్రాయపడ్డారు. ఈఅంశంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. కేసులో పేరు ఉన్నందున సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



జనగామలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## అందాల పోటీలకు వందల కోట్ల ఖర్చా?

- దేవాదుల మోటర్ల నిర్వహణకు రూ.6 కోట్లు ఇవ్వలేని సర్కార్
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 26 (నమస్తే తెలంగాణ) : పంటలు ఎండిపోయి అల్లాడుతున్న జనగామ జిల్లా రైతాంగానికి సాగు నీరందించే గండిరామారం దేవాదుల మోటర్ల నిర్వహణకు రూ.6 కోట్లు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలకు రూ. వందల కోట్లు ఖర్చుపెట్టడం సిగ్గుమాలిన చర్య అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో జనగామ అర్బన్, రూరల్, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన 82 మందికి రూ.2.46 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తాగు, సాగునీరు, రైతుబంధు, బీమా, పింఛన్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ ఇచ్చింది.. కానీ ఇప్పుడున్న ప్రభుత్వంలో అవన్నీ పోయి.. అందాల పోటీలు ఒక్కటే వచ్చాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా కొట్లాడుతానని స్పష్టం చేశారు. వందల కోట్లు పెట్టి స్పాన్సర్లను తీసుకొచ్చి వాళ్లందరిని ఎలా ఇబ్బంది పెట్టారో పత్రికల్లో చూస్తున్నామని తెలిపారు. అందాల పోటీల కోసం వందల కోట్లు మంచినీళ్ల ప్రాయంగా ఎందుకు ఖర్చుపెడుతున్నారో ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

## ● పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోండి



గంగాధర, మే 26 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి పేద విద్యార్థులను ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధరలో కలిసి మొరపెట్టుకున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాల కింద స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేలా ఏర్పాటుచేసిందని గుర్తుచేశారు. ఇందులో భాగంగా గంగాధరలోని వివేకానంద పాఠశాలలో 200 మందికి ఉచితంగా విద్యనందిస్తుండగా అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్ వసతికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తున్నదని చెప్పారు. రెండేండ్లుగా ఈ బిల్లులను చెల్లించకపోవడంతో ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు తీసుకోమని, విద్యార్థులకు సంబంధించిన బిల్లులు తల్లిదండ్రులు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం చెబుతున్నదని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి జూన్ పదో తేదీలోగా బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

# తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు

- అంచనా కంటే ముందుగానే రాక
- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- వచ్చే మూడ్రోజులు భారీ వర్షాలు : వాతావరణశాఖ

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణశాఖ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అంచనా వేసిన సమయం కంటే ముందుగానే వచ్చినట్టు తెలిపింది. ఉత్తర తెలంగాణపై ద్రోణి ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు పేర్కొన్నది. ప్రస్తుతం మహబూబ్‌నగర్ వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయని వెల్లడించింది. ఉత్తర తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర తీరం వరకు సగటు సముద్రమట్టం నుంచి 3.1 నుంచి 5.8 కి.మీ మధ్యలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. దీని ప్రభావంతో మంగళవారం (ఈనెల 27న) ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని, 29లోగా బలపడే సూచనలు ఉన్నాయని పేర్కొన్నది. దీంతో 27,28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్టు పేర్కొన్నది. యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేటలో 4.26 సెం.మీ అత్యధిక వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో 3.61 సెం.మీ., నారాయణపేట జిల్లా మరికల్‌లో 3.47 సెం.మీ., మక్తల్‌లో 3.05 సెం.మీ., కృష్ణలో 2.76 సెం.మీ., ధన్వాడలో 2.66 సెం.మీ., మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో 3.13 సెం.మీ., హన్వాడలో 3.40 సెం.మీ., దేవరకద్రలో 2.58 సెం.మీ., సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 3.32 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. పిడుగులూ పడుతాయని హెచ్చరించింది.



మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

Stree Nidhi Credit Cooperative Federation Ltd
Department of Rural Development: Government of Telangana
TFD No: 012/2014
Notification No:24 (Admin)2025 - 26 Date:27.05.2025
Recruitment of Deputy Managing Director
Stree Nidhi Credit Cooperative Federation Ltd. is an apex society at State Level, ... Stree Nidhi is looking for eligible professional from reputed institutions with experience in Banking/Micro finance sector for the post of Deputy Managing Director at Head Office, Hyderabad. ...
Applications are invited in prescribed format from eligible candidates for the post. For details regarding educational qualifications, age, eligibility criteria, experience, application format etc., please visit our website: www.streenidhi.telangana.gov.in ...
Last date for the submission of the applications is 16.06.2025.
Sd/- Managing Director